


# ఫారిన్ వెళ్ళాల(న)ండి

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

# చివరి విడత: మలి సందడి (26)

*స్నేహానంద లహరి*

సుందరం ఆ రోజు మధ్యాహ్నానికి బెర్లిన్ వస్తాడు. సాయంత్రం అతణ్ణి డాడ్ వాళ్ల గెస్ట్ హౌసు దగ్గర సకుటుంబంగా కలుసుకుందామని మేమనుకున్నాం. ఉదయం లేచింది మొదలు పిల్లలు– 'మిత్రమా సుందరం రావయ్యా, ఉరికురికీ ఉబికుబికీ రావయ్యా, పడగెత్తే పాములే పైకీ పాకీ, పరుగెత్తే జింకల్లే దూకీ దూకీ' అంటూ పాట లంకించుకున్నారు.

శ్రీమతి వాళ్ల పాటకు ముచ్చట పడుతూనే, "ఇలాంటివన్నీ నేర్పి మీరు వీళ్లని పాడు చేస్తున్నారు. అతడొచ్చినప్పుడు, మొహంమీదే ఇలా పాడితే మీరు తన రాకని వేళాకోళం చేస్తున్నారని అనుకోడూ" అని నన్ను కసిరింది.

నేను నవ్వి, "నువ్వు పిల్లల గురించి అంటున్నావు. నేనే అతణ్ణి ఈ పాటతో ఇంటికి ఆహ్వానిద్దామనుకుంటున్నాను" అన్నాను.

"నిజంగా అలా చేశారు కనుక" అని మందలించి, "పిల్లలకి గట్టిగా చెప్పండి– అతడి ముందు ఈ పాట పాడొద్దని" అని ఆర్డరేసింది.

"నేర్పడం వరకే నా వంతు. సరిదిద్దడం నీ వంతు" అని చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయాను.

నా ఆఫీసు జీవితంలో భువనేశ్వరుకీ, ఇక్కడికీ తేడా లేదు. అక్కడ 9–12.30 మార్నింగ్ సెషను. ఓ గంట లంచి బ్రేకు. భోజనం ఇంటి దగ్గరే. మళ్లీ ఈవెనింగ్ సెషను 1.30–4.30. వారానికి 6 రోజులు ఆఫీసు. రెండో శనివారం అదనపు సెలవు. ఇక్కడ మార్నింగ్ సెషను 8–12, ఈవెనింగ్ సెషను 1–5. లంచి బ్రేకు 12–1. ఆఫీసు దగ్గరే కాబట్టి భోజనం ఇక్కడా ఇంట్లోనే. వారానికి 5 రోజులే ఆఫీసు.

మధ్యాహ్నం లంచికి ఇంటికొచ్చినప్పుడు శ్రీమతి సుందరం ఫోను గురించి అడిగింది. ఇంకా ఫోను రాలేదనీ, అతడు బెర్లిన్ చేరేసరికి సాయంత్రం 4 కావచ్చు కాబట్టి ఆ తర్వాత ఫోన్ చేస్తాడనీ చెప్పాను.

"ఒకవేళ రావడం లేటై, అతడు బెర్లిన్ చేరేసరికి 5 దాటిపోతే, ఫోను కుదరదుగా, ఇక రేపే అతణ్ణి కలుసుకోవడం" అంది శ్రీమతి.

"మనమున్నది జర్మనీలో. సుందరం నాలుక్కి వస్తానంటే నాలుక్కే వస్తాడు. నేను ఐదింటిదాకా ఆఫీసులో ఉంటాను కాబట్టి ఆలోగా అక్కడికి ఫోను చేస్తాడు" అన్నాను.

"చేసినా ఆ విషయం మాకు తెలియదుగా. కాబట్టి నేటికి మనమతణ్ణి కలుసుకోవడం కుదరదు" అంది శ్రీమతి.

ఆఫీసులో నా లాబ్‌కి ఎక్స్‌టెన్షన్ ఫోనుంది. ఆ నంబరు సుందరానికి ఇచ్చాను. కానీ ఇక్కడ ఇంట్లో మా గదికి ఫోను లేదు. నేను శ్రీమతికి విషయం తెలియజేసే అవకాశం లేదు.

"సుందరం రావడం గ్యారంటీ కాబట్టి మనమతణ్ణి కలుసుకోవడం కూడా గ్యారంటీయే. నా మాట విని అతగాడు బెర్లిన్ చేరినట్లు ఫోనొచ్చేసిందనే అనుకో. నేను ఇంటికొచ్చేసరికి నువ్వు, పిల్లలు సిద్ధంగా ఉండండి. మనం వెళ్లి సుందరాన్ని కలుద్దాం" అన్నాను.

అయిష్టంగానే తలూపింది తను. నేను ఆఫీసుకి వెళ్లిపోయాను.

ఇలాంటి సమయంలో టైం గడవడం కష్టం. మాటిమాటికీ టైం చూసుకోవడంతో ఏకాగ్రత దెబ్బ తింటుంది. అప్పటికి నేను చేస్తున్న కెమికల్ రియాక్టర్ తయారీ వ్యవహారానికి ఏకాగ్రత బాగా అవసరం. అందుకని ఆఫీసుకి వెడుతూనే కొన్నాళ్లుగా వాయిదా వేస్తున్న కెటలిస్ట్ తయారీ ప్రయోగం మొదలెట్టాను.

హాట్ ప్లేటుమీద బీకర్లో ఐరన్, క్రోమియం నైట్రేట్ల సొల్యూషన్. దానికి జతపడిన యూరియా, మరికొన్ని రసాయనాలు. ఆ ద్రావకం సన్నని సెగలో వేడెక్కుతుంటే, ద్రావకమంతటా కొంచెం కొంచెంగా విడుదలయ్యే అమ్మోనియమ్ హైడ్రాక్సయిడుతో రసాయనిక చర్య వల్ల

క్రమంగా బయటపడుతున్న ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్ ప్రెసిపిటేట్. అది అడుక్కు స్థిరపడితే, వేడెక్కుతున్న ద్రావకం ఎగసి ఎగసి పడి బయటకు చిమ్మే ప్రమాదముంది. అలా జరక్కుండా ఆపడానికి, అందులో గిరగిర తిరిగే కవ్వంలాంటి ఎలక్ట్రిక్ స్టర్రర్. పది నిముషాలకోసారి ఆ కవ్వాన్ని ఆపి, తేరుకున్న పైనీటిని కొంచెం తీసి చల్లార్చి పీహెచ్ మీటర్లో పీహెచ్ ఎలా పెరుగుతున్నదీ చూసి, ఎప్పటికప్పుడు రీడింగ్సు నోట్ చేసుకోవడం. పీహెచ్ అనుకున్న విలువకు చేరుకుని మరి పెరక్కుండా ఆగిపోయేక, తేరుకున్న నీటిలో ఇంకా క్రోమియం, ఐరన్ ఉన్నవా అని రసాయనికపరీక్షతో నిర్ధారణ. కవ్వాన్ని ఆపినప్పుడు అడుక్కు స్థిరపడ్డ ఘనపదార్థంవల్ల ద్రావకం ఎగసి పడేలోగానే మళ్ళీ కవ్వాన్ని తిప్పడం. ద్రావకంలోని మొత్తం ఐరన్, క్రోమియం హైడ్రాక్సయిడ్సుగా మారేక, వేరుపడ్డ ఘనపదార్థాన్ని వడపోతతో వేరు చేసి, కడిగి శుభ్రపర్చడం. ఇదీ ప్రయోగం.

ఈ ప్రయోగాన్ని నిర్ధారించడానికి నాకు ఇండియాలో సుమారు రెండు నెలలు పట్టింది. ఇక్కడికొచ్చేక, కాస్త హెచ్చు మొత్తంలో తయారు చెయ్యడానికి అవసరమైన మార్పులు చెయ్యడానికి నెల రోజులు పట్టింది. ఒకసారి తయారీ విధానం నిర్ధారించేక, దీన్ని అనుసరించడం చాలా సులభం. రసాయనశాస్త్రానికి సంబంధించినంతవరకూ విద్యార్థులు ప్రాథమిక దశలో అవలీలగా చేసే ప్రయోగాలలాంటిది. చేస్తున్నప్పుడు బుర్రకి పెద్దగా పనుండదు కానీ, మరో పని చెయ్యడానికి వీలుండదు. దృష్టంతా దానిమీదే ఉండాలి. ఆపైన ఈ ప్రయోగం కెటలిస్టు తయారీలో అత్యంత కీలకం. కెటలిస్టుల్ని పరీక్షించే రియాక్టర్ తయారీ విషయమై బిజీగా ఉంటున్న నేను కొద్ది రోజులుగా ఈ ప్రయోగాన్ని వాయిదా వేసి, క్లిష్టమైన ఇతర ప్రయోగాలతో బుర్రకి పని చెబుతున్నాను.

రియాక్టర్ రెడీ కావడానికి ఇంకా టైముంది కాబట్టి, కెటలిస్టు అవసరం ఇంకా రాలేదు.

ఈరోజు నాకు సమయం గడవాలి. బుర్రకి అట్టే పనుండకూడదు. అందుకే ఈ ప్రయోగాన్ని ఎన్నుకున్నాను.

ప్రయోగంలో వడపోత పూర్తయ్యేక, నాకు ఫోనొచ్చినట్లు చెప్పాడు హైనర్ డెకర్ట్. అది సుందరంనుంచే అని ఊహించి టైం చూసుకుంటే నాలుగుం పావు. అంటే తెలియకుండానే టైం గడిచిపోయింది.

సుందరం ప్రోగ్రాం అనుకున్నట్లే జరిగింది. క్షేమంగా బెర్లిన్ చేరుకున్నాడు. కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ దగ్గర డాడ్ సంస్థకు చెందిన గెస్టుహౌసులో ఉన్నాడు. చిరునామా చెప్పాడు.

అచ్చ తెలుగు మనిషి. అచ్చతెలుగు మాట. రాగానే ఇలా సమాచారం అందించిన అచ్చతెలుగు పద్ధతి. ఆత్మీయంగా అనిపించింది.

"ఏడయ్యేలోగా మేమొచ్చి నిన్ను కలుసుకుంటాం. మా ఇంటికి తీసుకెడతాం. ఈరాత్రికి మా ఇంట్లోనే భోజనం" అన్నాను.

"వస్తానన్నావుగా, అన్నీ కలుసుకున్నాక మాట్లాడుకుందాం" అని ఫోను పెట్టేశాడు సుందరం.

సుందరం నా పిలుపుకి ఎంత సంతోషించాడో అతడి గొంతు వినగానే తెలిసిపోయింది. తృప్తిగా అనిపించింది.

ఫోను పెట్టేసేసరికి టైం నాలుగున్నర. అప్పట్నించి ఐదయ్యేదాకా గడియారం నత్త నడక నడిచింది. ఐదవగానే నేను ఆఫీసునుంచి బయటికి చిరుతలా లంఘించాను. రెండే రెండు నిముషాల్లో ఎర్నెస్ట్ రాయిటర్ ప్లాట్జ్ ఊబాన్‌హాఫ్ చేరాను. వెళ్ళీ వెళ్లగానే ఊబాన్ వచ్చింది. ఒక్క నిముషంలో మా స్టేషన్ డాయిచే ఓపర్ కి చేర్చింది. అక్కణ్ణించి మళ్ళీ చిరుతనై రెండే రెండు నిముషాల్లో ఇల్లు చేరాను.

అప్పటికే శ్రీమతి, పిల్లలు తయారై సిద్ధంగా ఉన్నారు. రామాయణంలో హనుమంతుడు రాముడికి, 'చూసితిని సీతను' అని చెప్పినట్లు, "మనం వెడుతున్నాం" అన్నాను ఆమెతో. వెంటనే పిల్లలు అందుకున్నారు, "మిత్రమా సుందరం రావయ్యా------"

"ఆపండి" వాళ్లని కసిరింది శ్రీమతి.

నలుగురం బయల్దేరి డాయిచే ఓపర్ చేరాం. ఎక్కువసేపు ఎదురుచూడకుండానే ఊబాన్ వచ్చేసింది. బాబు శ్రీమతి చెయ్యి పట్టుకుంటే, నేను పాప చెయ్యి పట్టుకున్నాను. పాపకి నేనలా తన చెయ్యి పట్టుకోవడం ఇష్టముండదు. తనకు తానుగా ఊబాన్ ఎక్కగలనని అనుకుంటుంది. అది నిజం కూడా! ఎందుకంటే ఇలాంటివి బ్రహ్మవిద్యలు కావు. అలవాటుని బట్టి ఉంటాయి.

మూడేళ్ల మా బాబుకీ తనకి తానుగా ఊబాన్ ఎక్కగలనని నమ్మకమే! కానీ ఊబాన్ రాగానే అప్రయత్నంగా అమ్మ చేయి పట్టుకుంటాడు.

పాపకి తను వాడికంటే పెద్ద అన్న ఫీలింగుంది. ఇలాంటి సందర్భాల్లో అదెప్పుడూ మా చేతులు పట్టుకోదు. కానీ నేను చెయ్యి పట్టుకుంటే అయిష్టం నటిస్తుందే తప్ప విడిపించుకోదు.

ఊబాన్ మమ్మల్ని కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ చేర్చడానికి నాలుగైదు నిముషాలు తీసుకుందేమో. మేమేమో స్టేషన్లోంచి బయటపడి రోడ్డెక్కగానే పిల్లలిద్దర్నీ చూస్తూ, "మనమిప్పుడు ఎక్కడికెడుతున్నామో తెలుసా?" అనడిగాను.

అంతే, ఇద్దరూ ఏకకంఠంతో, "మిత్రమా, సుందరం రావయ్యా" అని పాట లంకించుకున్నారు.

"మీరొకరు? మరిపించాలని నేను చూస్తుంటే, తీరికూర్చుని వాళ్లకి మళ్లీ గుర్తు చేస్తారు" అని శ్రీమతి విసుక్కుంది.

చేతిలో బెర్లిన్ సిటీ మ్యాప్. ఇంటి నంబరు తెలిస్తే చాలు, క్షణాలమీద చిరునామా పసికట్టేసేలా రూపొందించబడిన ఆ మహా పటాన్ని చూడగానే నాకు యశోదకు మొత్తం భూగోళాన్ని చూపించిన కృష్ణుడి నోరు గుర్తొస్తుంది.

సుందరం చెప్పిన నంబరు నా బుర్రలో ఉంది. మాప్ సాయంతో మేం నలుగురం సుందరం ఉండే చోటు చేరడానికి ఎంతోసేపు పట్టలేదు. ఆ చోటు అదేనని నిర్ధారించుకుందుకూ ఎంతోసేపు పట్టలేదు. సుందరం అటూ ఇటూ పచార్లు చేస్తూ బయటనే కనిపించాడు. అటూ ఇటూ చూస్తూ మమ్మల్నీ గమనించాడు.

మేం కలుసుకుని ఎన్నో నెలలైనా ఒకరినొకరు ఇట్టే గుర్తు పట్టాం. అతడికీ, మా కుటుంబానికీ పరస్పరం పరిచయాలయ్యేక, శ్రీమతికి కూడా దగ్గర బంధువుని కలుసుకున్నట్లే అనిపించింది. ఆమె చప్పున అతణ్ణి మా ఇంటికి ఆహ్వానించింది.

"నాకైతే ఊరు చూడాలని లేదు. అన్ని రోజులూ మీ ఇంట్లోనే గడపాలనుంది. కానీ ఇక్కడ మన పెత్తనమేం లేదు. డబ్బు ఖర్చు పెట్టి ఇక్కడికి తీసుకొచ్చారుగా, అంతా వాళ్లు చెప్పినట్లే చెయ్యడం మర్యాద" అని నిట్టూర్చాడు సుందరం.

ఓ గంటలో డాడ్ సభ్యులతో సమావేశముంది. బెర్లిన్ చూడ్డానికి వచ్చినవారందరూ అందులో విధిగా పాల్గొనాలి. బెర్లిన్ గురించీ, ఆ నగరపు చారిత్రక ప్రాధాన్యం గురించీ తెలుసుకోవాలి. కాబట్టి ఈ రోజుకి అతడు మా ఇంటికి రాలేదు. ఆ విషయాన్నే అతడు మాకు మర్యాదగా చెప్పాడు.

అతడు తన నాలుగు రోజుల కార్యక్రమాన్నీ క్లుప్తంగా వివరించాడు.

రోజూ ఉదయం అల్పాహారవిందు. సుమారు 11 తర్వాత నగర సందర్శనానికి బయల్దేరాలి. కాబట్టి అతడు అక్కడి అల్పాహారాన్ని వదులుకుని ఆ సమయాన్ని మా ఇంట్లో గడుపుతాడు. రాత్రి ఏడు తర్వాత మా ఇంటికి డిన్నరుకి వచ్చి 10 దాకా గడిపి వెళ్లిపోతాడు. "మీ ధర్మమా అని – టిఫినుకీ, రాత్రి భోజనానికీ వీళ్ల తిండి తప్పింది" అన్నాడతడు.

పాశ్చాత్యులకి వాళ్ల తిండి గొప్ప. మన తిండి అంటే చిన్నచూపు. మనకీ అంతేనని వాళ్లే కాదు, మనవాళ్లలో కూడా చాలామంది అనుకోరు. ఎందుకంటే – వాళ్ల వంటకాలకి అలవాటు పడ్డం ఆధునికతకి నిర్వచనమనుకునేవారు మనలో ఎక్కువ. ఐతే మనలో కూడా కొందరు వాళ్ల ఎదుట కాకపోయినా, చాటుగా ఐనా వాళ్ల తిండిని చిన్నబుచ్చడానికి సంకోచించరు. వాళ్లలో సుందరం ఒకడు.

నేను మాత్రం వెంటనే, "మర్యాదకి నువ్వలాగన్నా, మాకోసం నువ్వు ఏం వదులుకుంటున్నావో నాకు తెలుసు. ఆతిథ్యం విషయంలో వీళ్లు డబ్బుకి ఏమాత్రం వెనుకాడరు. ఎంతోమంది మనవాళ్లకి కూడా వీళ్ల విందులు ఓ కల" అన్నాను.

"అది ఆల్కహాలికులకి. మనలాంటి హాలికులకి కాదు" అని నవ్వాడు సుందరం.

అక్కడ మేమో పావుగంట ఉన్నాం. సుందరంనుంచి వీడ్కోలు తీసుకున్నాక, "అక్కడున్నంతసేపూ నాకు ఒకటే టెన్షన్. మరి కాసేపుంటే మనవాళ్లు పాట అందుకుంటారేమోనని" అంది దారిలో.

"సుందరం హాస్యప్రియుడు. అర్థం చేసుకోవడమే తప్ప అపార్థం చేసుకోవడం తెలియని మంచివాడు. మనవాళ్ల పాట వింటే సంతోషిస్తాడే తప్ప నొచ్చుకోడు. ఐనా నీకు నచ్చలేదు కాబట్టి ఆ పాటని ఇంతటితో మర్చిపొమ్మని పిల్లలకి నచ్చజెబుతాన్లే" అన్నాను.

మావాళ్లు బంగారు కొండలుగా, ఇల్లు చేరేలోగా తామా పాటని ఇంక పాడమని హామీ ఇచ్చేశారు.

ఇల్లు చేరేసరికి పిల్లలు బాగా అలసిపోయారు. ఎలాగో భోంచేసి పడుకున్నారు.

పెళ్లయినప్పట్నించీ కూడా ప్రతి విషయంలోనూ ముందుగా ప్రోగ్రాం వేసుకోవడం మా ఇద్దరికీ అలవాటు. ప్రతి ఏటా జనవరి ఒకటవ తేదీన – ఇద్దరం కూర్చుని – ఆ ఏడాది వేడుక జరుపుకునే పండుగలు, జన్మదినాలు వగైరా విశేషాల్ని ఓ కాగితంమీద వ్రాసుకుని బడ్జెట్ వేసేవాళ్లం. ఆ తర్వాత ప్రతినెలా ఆ బడ్జెటుని పునఃసమీక్షించేవాళ్లం. బంధుమిత్రుల రాక గురించి తెలిసినప్పుడు, వాళ్లనెలా ఆదరించాలో కనీసం వారానికి ముందే నిర్ణయించేవాళ్లం. అనుకోని ఖర్చులు వచ్చినప్పుడు, అప్పనేది చెయ్యకుండా ఉండడానికి, అనుకున్న ఖర్చుల్లో వేటిని మినహాయించాలో తేల్చుకునేవాళ్లం. మాకున్న బాధ్యతల్ని, మాకొచ్చే ఆదాయంతో అనుక్షణమూ బేరీజు వేసుకునే ఈ అలవాటు మాకు మా ఆదాయాన్ని అక్షయపాత్ర చేసింది. మా ముందుచూపు బంధుమిత్రుల్లో మాకు మంచి పేరు తెచ్చింది.

సుందరం గురించి మేమిద్దరం ముందే ప్లాను సిద్ధం చేసుకున్నప్పటికీ, ఇప్పుడతడి ప్రోగ్రాం గురించి మాకు నిరుష్టంగా తెలియడంవల్ల –నేను, శ్రీమతి రానున్న నాలుగు రోజుల ప్రోగ్రాం గురించి మరోసారి చర్చించాం.

"మీరన్నది నిజమే! డాడ్ వాళ్ల విందుని అతడు మనకోసం మిస్సవుతున్న విషయం ఇంతవరకూ నా బుర్రకెక్కలేదు. అతడికా లోటుని స్ఫురణకి రాకుండా చెయ్యాలి మన ఆతిథ్యం. తెలుగువాళ్ల స్పెషల్ పెసరట్–ఉప్మాని రేపటికి ప్లాన్ చేసి మంచి పని చేశాం" అందామె.

నేను అడ్డంగా తలూపి, "కానీ పెసరట్–ఉప్మా ఐతే హెవీ ఔతుంది. ఈ రాత్రి డిన్నర్లో అక్కడేం తింటాడో, రేపటికి అతడి జీర్ణశక్తి ఎలా మారుతుందో తెలియదు. కాబట్టి ఆ టిఫిను ఆఖరి రోజుకి ప్లాన్ చేద్దాం. స్టమక్ అప్సెట్టయినా అప్పటికి ఇల్లు చేరిపోతాడు" అన్నాను.

శ్రీమతి భృకుటి ఒక్క క్షణం ముడత పడింది. ఆ వెంటనే, "భలే చెప్పారండీ. మీ సూచనతో మొత్తం షెడ్యూల్ మార్చేస్తాను" అంది.

నా జోక్యంతో తన ప్లాను మార్చినందుకు కోపం వచ్చిందేమోనని ముందు నొచ్చుకున్నాను. కానీ ఆమె వివరించేక, ఆతిథ్యం విషయంలో ఆడవాళ్ల ఆలోచనల లోతు అప్పుడే నా అవగాహనకు వచ్చింది.

సుందరాన్ని కలుసుకున్నప్పుడు శ్రీమతికి కొత్తగా అనిపించలేదు. అందుకు కారణం అపరిచితుల్ని కూడా క్షణాలమీద ఆత్మీయుల్ని చేసుకోగల అతడి వ్యక్తిత్వం. అంతమాత్రాన అతడికి మొహమాటం ఉండదని కాదు. దాన్నతడు చొరవ చాటున మభ్యపర్చాడు. నిజానికి ఈరోజే అతడికి మా కుటుంబంతో పరిచయం అయింది. అలాంటప్పుడు వరుసగా నాలుగు రోజులు మా ఆతిథ్యం తీసుకోవడానికి మనసు వెనుకాడకుండా ఉండదు. ఒక రోజు గడిచేక ఏదో వంక పెట్టి మర్నాడు రాకపోవచ్చు కూడా. అత్తారింట ఉన్న భారవికి జరిగినట్లు, మా ఆదరణ రోజు రోజుకీ పల్చబడకూడదు.

ఒక విధంగా చెప్పాలంటే అతడు మా ఇంట నాలుగు రోజులూ ఆతిథ్యం స్వీకరిస్తే, అది మా ఆదరణకు లభించే యోగ్యతాపత్రం.

“కాబట్టి మన ఆతిథ్యం సింపులుగా మొదలవ్వాలి. మొన్నటికన్నా నిన్న వింతగా, నిన్నటి కన్నా నేడు వింతగా – అనిపించాలతడికి. వెళ్లిపోయే రోజున, అప్పుడే వెళ్లిపోతున్నానా అనిపించేటంత ఘనంగా ఉండాలి” అంది శ్రీమతి.

ఇది నా ఊహకి తట్టలేదు. ఆమె చెప్పింది వినగానే, మహిళే అన్నపూర్ణ కావడానికి కారణం తెలిసింది.

“కురుక్షేత్ర యుద్ధానంతరం భీష్ముడు ధర్మరాజుకి రాజధర్మాలని ఉపదేశిస్తాడు. ఆ వివరాలు మహాభారతంలో అనుశాసనిక పర్వంలో ఉన్నాయి. మన దేశంలో ప్రతి మహిళా ఆతిథ్య ధర్మాల్ని ఉపదేశించగల ఓ భీష్ముడని ఇప్పుడు నాకు అర్థమైంది” అని అప్రయత్నంగా ఆమెని మెచ్చుకున్నాను.

ఆ తర్వాతనుంచి ఆమె చెప్పడం, నేను వినడం. రానున్న నాలుగు రోజులకూ మా దైనందిన కార్యక్రమంలో మార్పుల్ని నిర్ణయించాం. వాటిలో నా ఆఫీసు వేళలు కూడా ఉన్నాయి.

నేను డాడ్ స్కాలర్ని. ఓ ఏడాది ఉండి వెళ్లిపోయేవాణ్ణి. జర్మనీలో సాంస్కృతిక, సాంఘిక, వైజ్ఞానిక వాతావరణాన్ని పరిచయం చేయడం ఈ స్కాలరుషిప్పు ముఖ్యోద్దేశ్యం. రీసెర్చిలో అనుకోనిది ఏదైనా సాధిస్తే అది బోనస్. అంతకుమించి మానుంచి వారు ఆశించేది తక్కువ. అందువల్ల నేను రోజూ ఆఫీసుకొస్తున్నానా, ఆఫీసు వేళలు పాటిస్తున్నానా, అన్న విషయాన్ని అంతగా ఎవరూ పట్టించుకోరు. కానీ నా తీరు తేడాగా ఉంటే అది గమనించడం జరుగుతుంది. నా గురించి తేడాగా అనుకుంటారు కానీ అనుకుని ఊరుకుంటారంతే!

ఐతే ఇక్కడ నేను నేను కాదు. భారతీయుణ్ణి. నన్ను నన్నుగా కాక ఒక భారతీయుడిగా గుర్తుంచుకుంటారు వీళ్లు. నా తీరు నా దేశానికి అంటగట్టబడుతుంది. నేనేం చేసినా ఆ విషయం మర్చిపోకూడదు. నేను నాకు నచ్చిన తీరులో ఉంటూనే, నా దేశాన్ని చిన్నబుచ్చే తీరుకి దూరంగా ఉండాలి. ఇది మొదట్నించీ నాలో ఉన్న అభిప్రాయం.

రీసెర్చి పరంగా కూడా నాకిది అపూర్వావకాశం. నేను ఇండియాలో ఉండగా చెయ్యలేని పరిశోధనలకు ఇక్కడి లాబొరేటరీని, ఇక్కడి సదుపాయాల్ని, నైపుణ్యాల్ని ఉపయోగించుకోవాలి. నా ప్రొఫెసర్ రాలెక్ ఈ నా తపనను గుర్తించి – నామీద ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నాడు.

అందుకే మర్నాటినుంచి సుందరానికి వీలుగా ఉండేలా నా ఆఫీసు వేళలు మార్చుకున్నప్పటికీ, పని వేళలు రోజుకి ఎనిమిది గంటలు ఉండాలనుకున్నాను. అడిగేవాళ్లు లేనప్పుడు పాటిస్తేనే, అది అసలైన క్రమశిక్షణ అనిపించుకుంటుంది కదా!

“రేపట్నించి ఉదయం ఆఫీసుకి రెండు గంటలు లేటుగా వెడతాను. లంచికి ఇంటికి రాను. సాయంత్రం ఐదుకి బదులు ఆరుకి వస్తాను. ఇంటి పనులన్నీ నువ్వే పూర్తిగా మానేజ్ చేసుకోవాలి” అన్నాను శ్రీమతితో.

“మన పిల్లలు బంగారు కొండలు. అదనంగా ఒక్క మనిషికిచ్చే ఆతిథ్యంకోసం, నాకు మీ సాయం అవసరమనిపించదు” అంది తను.

మర్నాడుదయం ఎనిమిది దాటేసరికి సుందరం మా ఇంటికొచ్చాడు. మాటిచ్చిన ప్రకారం ఆ సాయంత్రం ఏడుకి కూడా వచ్చాడు. ఆ మర్నాడూ, ఆ మర్నాడూ కూడా అలాగే వచ్చాడు. నాల్గవరోజున వాళ్లని షాపింగుకోసం వదిలేశారుట.

“ప్రతిరోజూ షాపింగుకి ఎంతో కొంత సమయం దొరుకుతోంది. అది చాలు నాకు. నాలుగో రోజు మొత్తం మీ ఇంట్లోనే గడుపుతాను” అన్నాడు సుందరం.

అతడు అలాగనడం మా ఆదరణకు యోగ్యతాపత్రంలా మాత్రమే కాదు, మాకో వరంలా కూడా అనిపించింది. ఎందుకంటే అతడు మాతో గడిపిన ప్రతి క్షణమూ ప్రత్యేకమే!

సుందరం రీసెర్చిలో ఎంత ఘటికుడో, నిజజీవితంలో అంత సంసారపక్షం మనిషి.

అతడికి ఉమ్మడి కుటుంబపు అనుబంధాలు తెలుసు. వంటింటి చిట్కాలు తెలుసు. మన విలువలు తెలుసు. ఆమేరకు పాశ్చాత్యుల విలువలపై సదభిప్రాయం లేనప్పటికీ, వారినుంచి నేర్చుకోతగిన, నేర్వవలసిన సత్సంప్రదాయాలూ తెలుసు.

అతడు స్వంతమనిషిలా కలిసిపోవడంవల్ల, మాకు ఇంట్లో ఓ అతిథి ఉన్నాడన్న భావమే కలుగలేదు.

శ్రీమతి వంటల్ని అతడు చాలా మెచ్చుకున్నాడు. అప్పుడు నేనతడితో, "తను ఇంకా హైస్కూల్లో ఉండగానే పెళ్లయిపోయింది. ఇంట్లో వంట నేర్చుకునే అవకాశం రాలేదు. చిన్నప్పట్నించీ మా అమ్మ వంటకి పైపనుల్లో కూరలు తరగడం, రోట్లో దంపడం వగైరా సాయాలు చెయ్యడమే తప్ప నాకూ వంటపట్ల అవగాహన లేదు. నేను నా కెమిస్ట్రీ అనుభవానికి ఊహని కొంత జోడించి తనకి వంట నేర్పాను. తను మహిళలకు ప్రత్యేకమైన ప్రేమానురాగాలతో తన వంటకు మెరుగులు దిద్దింది. వంట తెలిసినవారెవర్ని కలుసుకున్నా వంటింటి చిట్కాల్ని అడిగి తెలుసుకుంటూంటుంది. నీకేమైనా చిట్కాలు తెలిస్తే చెప్పొచ్చు" అన్నాను.

"నాకు వంట బాగానే వచ్చు. మా ఇంట్లో అమ్మ దగ్గర్నుంచి వదినలదాకా, నేను రుచి చూసి బాగుందంటే తప్ప తమ వంటల విషయంలో తృప్తి పడరు. అలా నా సర్టిఫికెట్టుకీ విలువుంది. కాబట్టి చెబుతున్నాను. ఈ నా చెల్లెలి వంటలు అద్భుతం. జర్మనీలాంటి దేశంలో దోసావకాయ పెట్టిందంటే, తన గురించి ఏంచెప్పాలి?" అన్నాడు సుందరం మెప్పుకోలుగా.

శ్రీమతి వెంటనే, "అభిమానం కొద్దీ మీరలాగన్నా, దోసావకాయలో ఉప్పు పాళ్లు కుదరలేదని నాకు తెలుసు" అంది.

సుందరం నవ్వి, "దోసావకాయలో ఉప్పు పాళ్లు ఎవరికీ కుదరవు. ఎందుకంటే ఎంత ఉప్పేసినా దోసకాయ ముక్కలు ఉప్పుని పీల్చేసుకోవడంతో, ఆవపిండిలో ఉప్పు తక్కువైందనిపిస్తుంది. అందుకే దోసావకాయలో ఉప్పు కాస్త తక్కువ వెయ్యడం మంచిది. అన్నంలో దోసావకాయ కలుపుకున్నప్పుడు, ముద్దని ముక్కతో తినాలి. ఉప్పు సరిపోతే ఓకే, తక్కువైతే మాత్రం అప్పటికప్పుడు అన్నంలో వేసుకోవాలి తప్ప ఊరగాయలో మాత్రం పదే పదే ఉప్పు వెయ్యకూడదు" అని, "చాలా బాగా చెప్పాను కదూ, ఇలాంటి సందేహాలు ఇంకా ఏమైనా ఉంటే అడగొచ్చు" అన్నాడు,

శ్రీమతి తటపటాయించలేదు. "మీకోసం ఇడ్లీ కూడా చేద్దామనుకున్నాను. ఎందుకంటే కారప్పొడి, నెయ్యి దొరుకుతున్నాయి. కొబ్బరి పచ్చడి చెయ్యొచ్చు. ప్లేట్లో వడ్డిస్తే వాటన్నింటితో – చూడగానే మనవాళ్లకి ప్రాణం లేచొస్తుందని తెలుసు. కానీ ఇక్కడ వాతావరణంలో తగిన వేడి లేక పిండి సరిగ్గా పులవడం లేదు. ఇడ్లీలు గట్టిగా వస్తున్నాయి" అంది శ్రీమతి.

దానికతడు వెంటనే, "ఇక్కడే కాదు, ఇండియాలోనూ మెత్తటి ఇడ్లీలు వెయ్యడం ఓ కళ. నాకు తెలిసి ఓ చిట్కా ఉంది. మినప్పప్పు నానబోసినప్పుడు, అదే సమయంలో వేరే గిన్నెలో నూక కూడా నానబోయాలి. పప్పు నానేక రుబ్బిన పిండిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. నూకని నీళ్లు పోయేలా చేత్తో పిండి, రుబ్బిన మినప్పిండిలో బాగా కలపాలి" అన్నాడు.

వంటల విషయం పక్కన పెడితే అతడు తన సమయంలో కొంత మా పిల్లలకీ కేటాయించాడు. వాళ్లకి నచ్చే కబుర్లు చెప్పాడు. "మా పిల్లలు కూడా ఇంత చిన్నవాళ్లయితే, బడి గొడవ ఉండేది కాదు. వాళ్లనీ తీసుకొచ్చి ఉండేవాణ్ణి" అని బాధ పడ్డాడు.

తన భార్య వచ్చి ఉంటే మా పరిచయానికి ఎలా స్పందించి ఉండేదో పదే పదే స్మరించుకుని, ఆమె పాడిన 'చలమేలరా, సాకేత రామా' అన్న త్యాగరాజ కీర్తనని తను తెచ్చిన టేపులో వినిపించాడు.

అబద్ధమెందుకూ, అప్పటికి నాకు సినిమా పాటలు తప్ప మరో సంగీతం తెలియదు. శ్రీమతికి నాకు తెలిసింది తప్ప మరొక పాట తెలియదు. ఆ పాట విని, అలాంటి కీర్తనలు కొన్ని నేర్చుకోవలసిందే అనిపించింది.

సుందరం తన తోబుట్టువుల్ని ప్రస్తావించాడు. వాళ్లంటే అతడికి చెప్పలేనంత ఇష్టం. తన తండ్రిని తల్చుకున్నాడు. ఆయనంటే అతడికి చెప్పలేనంత గౌరవం. ఆయన వ్రాసిన 'కడు విచిత్రము జగతి, కనరారు ముందు గతి' అనే పాట ఒకటి తనకి ఎంతో ఇష్టమంటే – అతడిచేత పాడించి రికార్డు చేశాము.

అతగాడి గొంతు అంత మధురమనీ, అతడు అంత బాగా పాడగలడనీ మేమూహించలేదు. పిల్లలతో సహా అంతా నిశ్శబ్దంగా విన్నాం. పాట అవగానే అంతా చప్పట్లు కొట్టి అభినందించాం.

"చప్పట్లు కూడా కొట్టేస్తున్నారు. నిజంగా అంత బాగా పాడేనా?" అన్నాడు సుందరం ఆశ్చర్యానందాలతో.

అప్పుడతడికి రికార్డయిన పాట వినిపించాను. గ్రుండిగ్ స్పూల్ టైపు స్టీరియో టేపులో – ఆ పాట మరింత అద్భుతంగా రాణించింది.

"పాట బాగున్న మాట నిజమే! కానీ అది రికార్డింగు గొప్పతనం అనిపిస్తోంది" అన్నాడు సుందరం కొంచెం మొహమాటంగా.

తర్వాత మా సంభాషణ కాసేపు సంగీత సాహిత్యాలమీద నడిచి, వ్యక్తిగత పరిచయాల్లోకి మళ్లింది.

మాటల సందర్భంలో అతడు, "జొన్నలగడ్డ వారు నియోగుల్లోనూ, వైదీకుల్లోనూ ఉన్నారు. రెండు రకాలవారూ నాకు తెలుసు" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. ఆధునిక యుగంలో కూడా మన దేశం కులం ప్రాతిపదికపై నడుస్తోంది. ఆ కులాల్లో మళ్లీ ఎన్నో శాఖలు, ఉపశాఖలు. మేము ఒరిసాలో ఉండడంవల్ల – తెలుగువారి కులాలు, శాఖలకు అంత ప్రాముఖ్యం లేదు. ఉన్నా, స్వతహాగా నాకు వీటి స్పృహ పట్ల విముఖత ఉండడంవల్ల కూడా అంతగా ఆలోచించను. ఇప్పుడు జర్మనీలో బెర్లిన్లో ఉన్నట్లుండి నా కులమే కాక శాఖ ప్రస్తావన ఇలా వస్తుందని ఊహించలేదు.

"ఔను, జొన్నలగడ్డవారు కమ్మ, కాపు, మాల, మాదిగల్లో కూడా ఉన్నారు. నాకూ తెలుసు" అని, "మీ నాన్నగారి పాట సాహిత్యం చాలా బాగుంది. మీది సాహితీ కుటుంబమా?" అన్నాను మాట మార్చడానికి.

"మా ఇంట్లో రాసేవాళ్లు తక్కువే కానీ, సాహితీపరుల గురించి చర్చలు ఎక్కువే. మహాభారతాన్ని తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ వ్రాసారా? వారిలో నన్నయ వైదీకి. మిగతా ఇద్దరూ నియోగులు. శైలిలో వైదీకులకూ, నియోగులకూ ఉండే భేదం గురించి మా బంధువుల్లో చాలామంది చర్చిస్తుంటారు. తిక్కన పదిహేను పర్వాలు వ్రాసినా, నన్నయ రెండున్నర పర్వాలముందూ అవి తేలిపోతాయని వాళ్లు ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. నువ్వేమంటావ్?" అన్నాడు.

టాపిక్ మళ్లీ మొదటికే వచ్చేసరికి ఏంచెయ్యాలో తోచలేదు. "నాకు పద్యకావ్యాల్ని విశ్లేషించేటంత పాండిత్యం లేదు" అన్నాను.

"పోనీ కథల్ని తీసుకుందాం. మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, అడవి బాపిరాజు, గుడిపాటి వెంకటచలం – వీళ్లలో ఇంటిపేర్లని బట్టి నియోగులెవరో వైదీకులెవరో నీకు తెలిసే ఉండాలి. వాళ్ల కథల గురించి మాట్లాడుకుందాం" అన్నాడు సుందరం.

"ఏమో, ఇంటిపేర్లనిబట్టి ఎవరు వైదీకులో, ఎవరు నియోగులో చెప్పడం కష్టమని ఇందాకనే అనుకున్నాంగా. నా స్నేహితుల్లోనే వైదీకి జొన్నలగడ్డవారూ ఉన్నారు. నియోగి జొన్నలగడ్డవారూ ఉన్నారు మరి" అన్నాను కాస్త అయిష్టంగా.

సుందరం వదల్లేదు, "ఎవరి విషయమో ఎందుకు? నువ్వెవరో చెప్పు" అన్నాడు సూటిగా విషయానికొస్తూ.

అప్రయత్నంగా సుందరాన్ని చూశాను. అతడి కళ్లలో ఏదో నమ్మకం. ఆ నమ్మకాన్ని ధ్రువపర్చుకోవాలన్న పట్టుదల. నేనేం చెబుతానో అన్న ఆత్రుత.

ఒక్క క్షణం తటపటాయించాను. ఇక ముసుగులో గుద్దులాటెందుకని, "మేము ఆరువేల నియోగులం" అని చెప్పాను. చెప్పాల్సి వచ్చిన సందర్భంవల్లనేమో, ఆ మాట చెప్పడానికి గొంతు ఓ పట్టాన పెగల్లేదు.

సుందరం ముఖం మాడిపోయింది. "చంపేశావ్ కదా!" అన్నాడు వెంటనే.

నేను ఉలిక్కిపడి, "ఏమన్నావ్?" అన్నాను.

"మొదటిసారి కాదు. నెలరోజుల తేడాలో ఇలా దెబ్బ తినడం రెండోసారి నాకు" అన్నాడు సుందరం డీలా పడ్డ గొంతుతో.

మా ఇంటికి అతిథిగా వచ్చిన మనిషి నావల్ల దెబ్బ తిన్నాడనగానే – మనసంతా ఏదోలాగైపోయింది.
కాసేపు నాకు నోట మాట రాలేదు. అతడూ మాట్లాడలేదు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments